

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 13 సంచిక : 09 మే 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(ఫైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


జిన్నూరు .............. 01-02-08

సఖినేటిపల్లి .......... 25-02-08



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 01-02-08, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనిషి యొక్క జీవితవిధానం ఎలా ఉండాలి, మనం ఎలా నడుచుకోవాలి అని ధర్మశాస్త్రం చెపుతుంది. ధర్మాన్ని ఆచరించకుండా మనం జపం చేసినా, ధ్యానం చేసినా మనస్సు అణగదు. భగవంతుడు ధర్మస్వరూపుడే. ధర్మ సంస్థాపనార్థం ఒక శరీరాన్ని కల్పించుకొని ఈ లోకంలోనికి వస్తాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. మనం నేను, నేను అంటున్నాము. నేను అనేటప్పటికి మనకు దేహం గుర్తుకు వస్తుంది. ఏ నేనుకయితే సంతోషం వస్తుందో, ఏ నేనుకయితే దుఃఖం వస్తుందో, శరీరం పుట్టినప్పుడు నేను పుట్టాను అని ఏనేను అయితే అనుకొంటోందో, శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని ఏ నేను అయితే అనుకొంటోందో అది నూటికి నూరుపాళ్ళు నువ్వు కాదు, అది అబద్ధమైన నేను. ఇది మీకు అర్థమవ్వాలి. ఆ నేనులో నుండి బయటకు వచ్చేవరకు మనం శవాలను మోస్తూ ఉండవలసిందే, ఇంక జన్మలు ఆగవు. కామక్రోధములు కూడా ఈ నేనుకే వస్తాయి. మీలో ఉన్న దేహగతమైన నేను ఒకరకంగా ఉండవచ్చు, నాలో ఉన్న దేహగతమైన నేను ఇంకోరకంగా ఉండవచ్చు కాని మన దేహాలు మటుకు అన్నం తినటం వలన ఇలా తయారైనాయి. అబద్దాలు రకరకాలుగా ఉంటాయి గాని నిజం ఒకేరకంగా ఉంటుంది. అందుచేత ఈ అబద్ధమైన నేనును మనం నమ్మటానికి వీలులేదు. విద్య వలన వినయం పెరుగును, అవిద్యవలన

మదము పెరుగును అని భర్తృహరి చెప్పాడు. విద్యవలన వినయం వస్తుంది, వినయం వలన యోగ్యత వస్తుంది. యోగ్యత వలన ధనం వస్తుంది, ధర్మాన్ని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించటం వలన మనస్సు సంస్కరించబడుతుంది. ధనం లేనివాడు ఈరోజు ఎలా వెళుతుంది అని ఆలోచిస్తూ ఉంటాడు. అందుచేత ధనానికి ఉండే ఉపయోగం ధనానికి ఉంది, దానివలన మనం అనేక మంచి పనులు చెయ్యవచ్చు అని భర్తృహరి చెప్పాడు. అందరి హృదయాలలో నేను ఆత్మగా ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు చెప్పిన నేను మటుకు నిజమైన నేను, ఆ నేనులో తేడా ఏమీ లేదు. అబద్ధమైననేను వచ్చేటప్పటికి తేడాలు వచ్చేస్తాయి.

మనం గుడిలో ఉన్న దేవుడిని నమ్ముతాము, వైకుంఠంలో ఉన్న దేవుడిని నమ్ముతాము ఇవి అన్నీ మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. మన ఇంద్రియాలతో సంబంధం లేకుండా, మనస్సుతో సంబంధం లేకుండా, బుద్ధితో సంబంధం లేకుండా మన హృదయంలో ఒక నేను ఉంది. అది ఒక్కటి మాత్రమే నిజం. అయితే మనకు ఉన్న దేహబుద్ధి వలన హృదయంలో దేవుడు ఉన్నాడు అన్న సంగతి మర్చిపోతున్నాము. అలవాట్లు నేర్చుకోవటం తేలిక, వాటిలో నుండి విడుదల పొందటం చాలా కష్టం. కొన్ని అలవాట్లు మనం ఎంత సాధన చేసినా అవిపోవు. చిన్న మొక్క అయితే చేతితో లాగేయవచ్చు, అదే చెట్టు అయితే గొడ్డళ్ళు పట్టుకొని వెళ్ళాలి. కొన్ని అలవాట్లు పైపైనే ఉంటాయి, అవి తేలికగానే పోతాయి. కొన్ని అలవాట్లు అలా కాదు చాలా లోతుగా ఉంటాయి. అవి ఎంత లోపలకు తన్నుకొని పోయినాయో అంత కష్టపడి సాధన చేస్తేగాని అవి బయటకు పోవు. నిజమైన నేను అంటే పరమాత్మ, పరమాత్మ మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు నేను వేరు, వారు వేరు అనే బుద్ధి పోతుంది, భేదబుద్ధి పోయిన తరువాత అమృతానుభవం కలుగుతుంది. గుడిలో దేవుడు ఉన్నాడు. ఆయనకు అభిషేకాలు చేస్తున్నారు. లోపల దేవుడు ఉన్నాడు కాబట్టి గుడిని శుభ్రంగా ఉంచుతున్నారు. మన హృదయంలో దేవుడు ఉన్నాడు, ఆయన నూటికి నురుపాళ్ళు నిజం. దేవుడు ఉన్న దేవాలయాన్ని ఎంత శుభ్రంగా ఉంచుతున్నారో, హృదయంలో కూడా దేవుడు ఉన్నాడు కాబట్టి, దేహమనే దేవాలయాన్ని కూడా శుచిగా ఉంచండి. మనం ఇంద్రియాల చుట్టూ, మనస్సు చుట్టూ తిరుగుతున్నాము అనుకోండి, వాటిలో నుండి బయటకు

రాలేకపోతున్నాము అనుకోండి యింక మనకు జ్ఞానం కూడా రాదు ఎందుచేతనంటే వీటితో సంబంధం లేకుండా మనలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు.

అంతర్యామిగా ఉన్న భగవంతుడిపట్ల, అగ్నిదేవుడిపట్ల, అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడి దగ్గరకు మిమ్మల్ని చేర్చే గురువుపట్ల, తల్లిపట్ల, తండ్రిపట్ల ఈ ఐదుగురిపట్ల గౌరవంగా ఉండమని పెద్దలు చెపుతారు. అంతర్యామిపట్ల మీరు ఎంత గౌరవంగా ఉన్నారో అంతర్యామి దగ్గరకు మిమ్మల్ని తీసుకొనిపోయే గురువు పట్ల కూడా అంతే గౌరవంగా ఉండాలి. సర్వకాల సర్వావస్థలలో భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడనే సజీవమైన విశ్వాసం ఉంటే, ఆ నమ్మకం స్థిరంగా ఉంటే వాడు శ్రద్ధావంతుడు, శ్రద్ధ అంటే అది. మీ ఆధ్యాత్మిక అభివృద్ధిని, భౌతిక అభివృద్ధిని ఎవరైతే కోరరో వారితో స్నేహం చేయవద్దు, వారితో జాగ్రత్తగా ఉండండి అని రామకృష్ణుడు చెప్పారు. పాము నోట్లో విషం ఉంటుంది, దానినోట్లో ఉన్న విషం దానినేమీ చేయదు, అది కరిచింది అనుకోండి మనలను చంపేస్తుంది. అలాగే భగవంతుడిలో అంతర్గతంగా మాయ ఉంది. ఆ మాయ భగవంతుడిని ఏమీ చేయదు. మనం అందులో పడ్డామా అది మనలను చుట్టేస్తుంది. ఆ మాయే మనకు నేనుగా వస్తోంది, అదే మనస్సుగా వస్తోంది అని మనం మర్చిపోయాము. ఏదైతే లేదో అది ఉన్నట్లుగా కనిపిస్తూ ఉంటుంది, అదే మాయ. ఈ దేహం ఉండగానే కామాగ్ని, క్రోధాగ్ని చల్లారాలి. అవి ఎంతకాలం అయితే ఉన్నాయో అంతకాలం ఆ జీవుడు పునర్జన్మలోనికి వెళ్ళిపోతాడు. శరీరానికి అన్నం పెడతాము. కాని ఈ దొంగ నేనుకు అన్నం పెట్టనక్కరలేదు. అది ఎలా పెరుగుతుంది అంటే మీకు ఏదైనా లాభం వచ్చింది అనుకోండి అది పొంగుతుంది, ఏదైనా నష్టం వచ్చింది అనుకోండి కుంగుతుంది, అప్పుడు అది ఆహారం తీసుకొని లోపల బలిసిపోతూ ఉంటుంది. అందుచేత బహుజాగ్రత్తగా ఉన్నవాడు కాని ఈ నేనులో నుండి బయటకు రాలేడు. ఈ జీవకోటి అంతా నా అంశే అన్నాడు పరమాత్మ. అంటే ఈ జీవకోటి అంతా ఆయనలో నుండే వస్తోంది. కిరణాలు ఎక్కడ నుండి వస్తున్నాయి, సూర్యుడి దగ్గర నుండి వస్తున్నాయి. సూర్యుడు ఏవిధంగా అయితే ఆ కిరణం నాది అనుకొంటాడో, ఈ జీవకోటి అంతా నాలో నుండి వస్తోంది అని భగవంతుడు అనుకొంటాడు, ఈ జీవులను తరింపచేయాలి అనుకొంటాడు. భగవంతుడు ఎన్ని పనులు చేస్తాడు అంటే ఈ ప్రపంచాన్ని సృష్టిస్తాడు, పోషిస్తూ ఉంటాడు,

అవసరమైనప్పుడు లయింపచేస్తాడు. వాడి అనుగ్రహం కూడా ఎలా చూపిస్తాడు అంటే భగవంతుడిని తెలుసుకొని బయటకు వెళ్ళినవారికి యింక శరీరం రాదు. భగవంతుడిని తెలుసుకోకుండా శరీరాలు చనిపోయినాయి అనుకోండి భగవదనుభవం పొందేవరకు వాడికి శరీరాలు వస్తాయి. శరీరం రావాలి అంటే మరల లోకం ఉండాలి.

లోకాన్ని ఎందుకు సృష్టిస్తాడు అంటే బద్ధజీవులకోసం సృష్టిస్తాడు కాని బుద్ధుడికి ఈ లోకం అక్కరలేదు. ఎవడైతే అజ్ఞానంలో ఉన్నాడో వాడు జ్ఞానం సంపాదించటానికి లోకం కావాలి. అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి వచ్చినవాడికి ఇంక లోకంతో పని లేదు. ఒకసారి మనం ఫెయిల్ అయిపోయాము అనుకోండి మరల పరీక్షలు రాసుకోండి అని చెపుతాడు, అప్పుడు కూడా ఫెయిల్ అయిపోతాము అనుకోండి, మరల ఇంకోసారి రాసుకోండి అని చెపుతాడు. అప్పటికి కూడా మనకు జ్ఞానం రాలేదు అనుకోండి. ఈ జ్ఞానం రాని మంద అందరికి మరల శరీరాలు ఇచ్చి ఈ సృష్టిలో పడేస్తాడు. జ్ఞానం వచ్చిన వారిని మరల ఈ సృష్టిలో కలపడు. అది అనుగ్రహకార్యం. అజ్ఞానంలో ఉన్నవారికి మరల ఒక అవకాశం ఇద్దాము, వీరు కూడా బాగుపడాలి అనుకొంటాడు, అది వాడి అనుగ్రహం, వాడి దయ, వాడే ఈశ్వరుడు. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఇది మనకు అర్థమయితే మీరు కూర్చొన్నవారు లేవకుండా మీకు దుఃఖం నశించిపోతుంది. అంతా ఈశ్వరుడే. జీవకోటి రూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. లోకం రూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. భగవంతుడే ఈ జీవకోటికింద, లోకంకింద కనిపిస్తున్నాడు. అందుచేత భగవంతుడిని తెలుసుకోవటానికి ఈ జీవకోటిని, లోకాన్ని కలుపుకో అన్నాడు రామకృష్ణుడు. మీకు నేను ఒక లడ్డూ ఇస్తే నేను ఏమనుకొంటాను, నేను ఇచ్చాను అనుకొంటాను ఎందుచేత మీ దేహగతమైన నేను వేరు, నా దేహగతమైన నేను వేరు. అదే హృదయగతమైన నేను నాకు అనుభవంలోనికి వచ్చింది అనుకోండి అప్పుడు మీకు లడ్డూ ఇస్తే నాకు నేనే ఇచ్చాను అనుకొంటాను ఎందుచేతనంటే అప్పుడు అంతా ఒక్కటే కాబట్టి. అహంభావన ఉన్నంతసేపు వేరుభావన ఉంటుంది, అప్పుడు వాడికి పుణ్యం తప్పదు, పాపం తప్పదు. మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే మనం ఎవరికైనా మంచి చేస్తాము అనుకోండి వారి దగ్గర నుండి కృతజ్ఞత ఆశించకూడదు, ఆశిస్తారు అనుకోండి ఈ మాయ

నేను పెరిగిపోతుంది అంటే దానికి ఆహారం సప్లయి అయిపోతుంది.

ధనం ఉన్నవాడు నాకు ధనం ఉంది అనుకొంటాడు, కీర్తి ఉన్నవాడు నాకు కీర్తి ఉంది అనుకొంటాడు. ఇలా నిజమైన నేను అనుకోదు, అబద్ధమైన నేను అనుకొంటుంది. ఇలా అనుకోవటం వలన అబద్దమైన నేను పెరిగిపోతుంది, జన్మలు పెరిగిపోతాయి. రోజుకు పది రూపాయలు సంపాదించి ముప్పై రూపాయలు ఖర్చుపెడుతూ ఉంటే మన పరిస్థితి ఎలా ఉంటుందో ఈ దొంగనేనును పెంచుకొంటూ మనం జపం చేసినా, ధ్యానం చేసినా మన పరిస్థితి అలాగే ఉంటుంది. మనస్సు స్వాధీనం అవ్వటానికి జపం, మౌనం సహకరిస్తాయి అని పెద్దలు చెపుతారు. మీకు ఇష్టమైన దేవుని నామం తీసుకొని జపం చేయటం వలన ఆ నామం ఏమి చేస్తుంది అంటే మీకు ఇతర తలంపులు రాకుండా ఆపు చేస్తుంది. మనస్సు అణగటానికి మౌనం కూడా మంచిదే.

మనకు ఎంతసేపు క్వాంటిటీ కావాలి కాని క్వాలిటీ అక్కరలేదు. ధృతరాష్ట్రుడు ఏమనుకొనేవాడు అంటే మా అబ్బాయిలు తరపున భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు ఉన్నారు, ఇంకా గొప్పవీరులు అనేకమంది ఉన్నారు, చాలా సైన్యం ఉంది ఇంతమందిని పాండవులు ఓడించగలరా అనుకొన్నాడు. సైన్యాన్ని పట్టుకొన్నాడు, వీరులను పట్టుకొన్నాడు కానీ అసలు రెండవ ప్రక్క పరమాత్మ ఉన్నాడు అన్న సంగతి ఈ గుడ్డివాడు మర్చిపోయాడు. శరీరంలోనేకాదు, మనస్సులో కూడా గుడ్డితనమే. కృష్ణుడు అర్జునుడికి చెప్పిన గీతను సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పి చివరలో ఒకమాట అంటాడు. ఎక్కడైతే కృష్ణుడు ఉన్నాడో, ఎక్కడైతే అర్జునుడు ధనస్సు పట్టుకొని ఉన్నాడో అంటే ఎక్కడైతే అనుగ్రహం ఉందో, ఎక్కడైతే కృషి ఉందో అక్కడ విజయం ఒక్కటేకాదు సంపదలు, సుఖాలు, నీతి, ధైర్యం అన్నీ ఉంటాయి, అసాధారణమైన శక్తి ఉంటుంది ఇది నా ఉద్దేశం అన్నాడు సంజయుడు. ఈ మాటలు ఎందుకు చెప్పాడు అంటే ధృతరాష్ట్రుడికి లోపల నావాళ్లే నెగ్గుతారు అనుకొంటున్నాడు. నీవారు నెగ్గుతారా, పరమాత్మ ఎక్కడ ఉంటే అక్కడే జయం అని చెప్పకుండా చెప్పటం. భోజనానికి వెళ్లేటప్పుడు రెండు నియమాలు చెప్పాడు పరమాత్మ. ఎవరైనా మిమ్మల్ని గౌరవంగా పిలిస్తే భోజనానికి వెళ్లండి, గౌరవంగా పిలవకపోతే భోజనానికి వెళ్లవద్దు. తినటానికి అన్నం లేకపోతే ఎవరి ఇంటికైనా వెళ్లి భోజనం పెట్టమని అడగవచ్చు. రాయభారానికి వెళ్లినప్పుడు

కృష్ణుడిని, ధుర్యోధనుడు భోజనానికి రమ్మంటాడు. అప్పడు కృష్ణుడు ఏమన్నాడు అంటే నువ్వు యాంత్రికంగా పిలుస్తున్నావు. నామీద నీకు గౌరవం లేదు అందుచేత రాను అని చెప్పాడు. నాకు తిండి లేకపోయినా నీ ఇంటికి రావచ్చు కాని నేను తిండి లేనివాడిని కాదు అందుచేత రాను అని చెప్పాడు, వాడు కృష్ణుడు. భీష్ముడు మహాజ్ఞాని. భీష్ముడు అస్తమించే టైములో ధర్మరాజుతో కృష్ణుడు ఒకమాట అన్నాడు, ఆ మాటమటుకు వళ్ళు జలధరిస్తుంది. భీష్ముడు అస్తమించటం అంటే జ్ఞానం అస్తమిస్తోంది అన్నాడు, అదీ భీష్ముడి వైభవం. ఆయన ఉండగానే అన్నీ చక్కపెట్టుకోండి అని చెప్పాడు. భీష్ముడు రాజనీతి, రాజధర్మాలు, లోకంలో ఎలా వ్యవహరించాలో అన్నీ చెప్పాడు. మీ గురించి తక్కువ అంచనా వేసేవారి దగ్గరకు వెళ్ళవద్దు అని భీష్ముడు చెప్పాడు, ఎందుచేతనంటే వారు ఏమిచేస్తారు అంటే మీరు కష్టపడి సంపాదించుకొన్న ఆత్మ విశ్వాసాన్ని చెడగొట్టేస్తారు. మాకు ఉపయేగపడేవి చాలా చెప్పావు తాతయ్యా, మేము తరించే ఉపాయం చెప్ప అని ధర్మరాజు అడుగుతాడు. అప్పడు విష్ణు సహస్రనామాలను భీష్ముడు చెపుతాడు. నీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం భగవద్గీత, విష్ణు సహస్ర నామాలను విడిచిపెట్టవద్దు అని ఆచార్యుల వారు చెప్పారు. నీ హృదయంలో ఉన్న నిజమైన నేనును తెలుసుకోవటానికి తపస్సు, ఆత్మ విద్య వీటిని విడిచి పెట్టవద్దు అని చెప్పాడు. ఆత్మ గురించి విసుగు వచ్చేలా శ్రవణం చెయ్యాలి. ఆత్మజ్ఞాన సముపార్జనలో అడ్డుగా వచ్చే ముళ్ళకంపలను తొలగించుకొంటూ రావాలి. ఆ ముళ్ళకంపలను తొలగించుకోవటానికే తపస్సు. ఆత్మజ్ఞాన సముపార్జనకు శ్రవణం. ఇవి రెండూ ఒకేసారి చేసుకొంటూ వెళితే నీవు తరిస్తావు.

ఏ హృదయంలో అయితే పరమాత్మ ఉన్నాడో అక్కడకు నువ్వు ప్రవేశించేటప్పడు కామక్రోధములు అనే ముళ్ళకంపలు నీకు అడ్డు వస్తాయి, అంత తొందరగా నువ్వు ప్రవేశించలేవు. జన్మాంతరం నుండి వచ్చే అలవాట్లు, శారీరక దోషాలు, మానసిక దోషాలు ఇవి అన్నీ అడ్డువస్తాయి. ఈ ముళ్ళ కంపలను నెట్టుకొంటూ వెళితేగాని నీవు హృదయంలో ప్రవేశించలేవు. నీవు హృదయంలో ప్రవేశిస్తేనే గాని నీకు ఆత్మజ్ఞానం రాదు. కొంతమంది ఏమంటారు అంటే అంతా నేనే అనుకోమంటారు. అంతా నేనే అంటే అక్కడ నిజమైన నేను. భక్తులు అలా అనుకోరు, అంతా భగవంతుడే అంటారు, అంతా నేనే అంటే ఒకోసారి

అహంకారం రావచ్చు, అంతా భగవంతుడే అనుకొంటే అది సేఫ్ సైడ్. లోపల వస్తువు ఉంది. దానిని తెలుసుకోవటానికి నీవు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయటం లేదు. అందుచేత అది నీకు తెలియటం లేదు. నీ అశాంతికి కారణం, నీ దుఃఖానికి కారణం బయట ఏమీలేదు. ఉదాహరణకు ఇద్దరకు ఒకే నష్టం వచ్చింది అనుకోండి, ఒకరు చాలా ఎక్కువ బాధపడతారు, ఒకరు ఎక్కువ బాధ పడరు. ఈశ్వరుడు ఇచ్చాడు, ఆయనే పట్టుకొనిపోయాడు అనుకొంటాడు. తీసుకోవటంలో ఉంటుంది. దుఃఖ కారణం నీలోపలే ఉంది, బయట ఏమీలేదు అంటున్నారు భగవాన్. బయట కారణాల వలన దుఃఖం వస్తుందని నీవు అనుకొంటున్నావు కాని అది నిజం కాదు. దేహగతమైన నేనే దుఃఖానికి కారణం. అది నశించింది అనుకోండి బాహ్యపరిస్థితులు బాగా ఉన్నా నీవు పొంగిపోవు, బాగా లేకపోయినా నీవు కుంగిపోవు, నీకు ఏమీ అనిపించదు. దేహగతమైన నేను ఉన్నంతకాలం ఏదోరకమైన సమస్యలు వస్తూనే ఉంటాయి. కొన్ని సమస్యలు పరిష్కారం చేసుకొన్నాము అనుకోండి, మరల కొత్త సమస్యలు వస్తూనే ఉంటాయి. నీ దుఃఖానికి కారణం దేహగతమైన నేనే అని నీకు తెలిస్తే దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తావు. మనందరం ఒకటే పొరపాటు చేస్తున్నాము. ఈ శరీరంలో ఒక నేను ఉందికదా, అది దేహంతో తాదాత్మ్యం పొంది ఉంటుంది. మనం మాట్లాడితే దాని కోసం మాట్లాడుతున్నాము, పనిచేస్తే దానికోసం పనిచేస్తున్నాము, మనం దానికోసమే జీవిస్తున్నాము. కాని పరమేశ్వరుడి దయకోసం పని చెయ్యటం లేదు. ఇంక మనం ఎన్ని జపాలు, ధ్యానాలు చేస్తే మటుకు ఏమి లాభం? మనం ఎంతసేపు ఆ నేను చుట్టూ తిరుగుతున్నాము అందుచేత మనకు చావులు తప్పవు, పుట్టుకలు తప్పవు. మనం పరమేశ్వరుడి అనుగ్రహం సంపాదించటానికి పనిచెయ్యము. శరీరానికి తగిలిన గాయం తొందరగా తగ్గుతుంది కాని ఈ మాయ నేనును ఎవరైనా గాయపరిచారు అనుకోండి, జీవితం పొడుగునా మీకు కక్ష ఉంటుంది, అందులో నుండి మీరు బయటకు రాలేరు, అదే రిపీటెడ్‌గా జ్ఞాపకం వస్తూ ఉంటుంది, దానిని మర్చిపోయే శక్తి మీకు లేదు.

మనం జరిగిపోయిన గొడవలు మర్చిపోవాలి, భవిష్యత్ గురించి గాలి మేడలు కట్టకూడదు. వర్తమానకాలాన్ని బాగా ఉపయోగించుకోవాలి, మనం ఇతరులకు మర్యాద ఇవ్వవచ్చు ఇతరులు మర్యాద ఇస్తే మనం పుచ్చుకోవచ్చు. ఇదంతా లోకానికి సంబంధించిన

విషయాలు. మీ మనస్సులో గౌరవంమటుకు భగవంతుడిమీదే ఉండాలి. ఇది మర్చిపోకూడదు. ఎందుచేతనంటే వాడికి మనకు ఉన్న అనుబంధం శరీరం పోయినా పోదు. మనకు ఉన్న భక్తి నిజమైతే, మనకు సత్వగుణం కనుక ఉంటే భగవంతుడే శరీరం ధరించి మనకోసం గురురూపంలో వస్తాడు. నీకు దుఃఖం వస్తూ ఉంటే, అశాంతి వస్తూ ఉంటే నీకు కల్పించుకొన్న విషయాల వలన వస్తోంది. కొన్ని పనులు మన వలన అవుతాయి. కొన్ని పనులు మన వలన అవ్వవు. ఈ పనులు అవ్వటం లేదు ఏమిటి అని పదిసార్లు అనుకోకూడదు, దానివలన దుఃఖం వస్తుంది. భగవంతుడి సంకల్పం అలా ఉంది అనుకొని గోడ కట్టినట్లుగా వాటిని వదిలేయాలి. ఈపని మన వలన అవుతుంది అనుకొంటే చేయటం, ఇది మన వలన అవ్వదు, మనకు సాధ్యం కాదు అనుకొంటే ఆ పనిని అక్కడే వదిలేయాలి. మీ శక్తికి మించిన పనులు నెత్తిమీద వేసుకొంటే మీకు అశాంతి వస్తుంది. ఎప్పుడు ఎవరిని కలపాలి, ఎవరిని విడదీయాలి అనేది పరమేశ్వరుడు చూసుకొంటాడు. జీవుడు ఎప్పుడు శరీరం ధరించాలి, ఆ దేహం ఎక్కడ ఉండాలి, వాడు అనుభవించవలసిన ప్రారబ్ధం ఏమిటి? ఇది అంతా పరమేశ్వరుడు చూసుకొంటాడు. ఈలోపుగా ఎవరో అవతారపురుషుడి దయవలన జ్ఞానం వచ్చిందా ఇంక వాడికి కర్మ లేదు, అకర్మ లేదు. కర్మబంధంలో నుండి బయటకు వచ్చేస్తాడు, పూర్వజన్మలనుండి వస్తున్న కర్మ ఏదైనా ఉన్నా అది అంతా కాలిపోతుంది.

అర్జునా! జ్ఞానంతో సమానమైనది కాని, జ్ఞానం కంటే మించినది కాని ఈ లోకంలోకాని, పరలోకంలోకాని లేదు. అట్టి ఆత్మజ్ఞానాన్ని సంపాదించు. దానికోసం అవసరమైతే గురువు దగ్గరకు వెళ్ళు. గురువుని గౌరవించి, ఆయనను ప్రేమించి, ఆయన చెప్పినది శ్రద్ధగా విని, మననం చేసుకొని, ఆ ప్రకారం జీవించు. ఏదైతే నీ హృదయంలో ఉందో దాని తాలుక ఎరుకే జ్ఞానం. దాని తాలుక ఎరుక నీకు వస్తే మొత్తం అన్ని స్వప్నాలు ఆగిపోతాయి, రాబోయే జన్మలు అన్నీ ఆగిపోతాయి. సంచితం కాలిపోతుంది, ప్రారబ్ధం కాలిపోతుంది, ఆగామి కాలిపోతుంది. నేను అనేది ఒక తలంపు. దానినే మూలతలంపు అన్నారు భగవాన్. ఈ నేను అనే తలంపుకే మిగతా తలంపులు అన్నీ వస్తున్నాయి. మంచి వచ్చినా, చెడ్డ వచ్చినా, ఎన్ని గొడవలు వచ్చినా అన్నీ ఈ నేనుకే వస్తాయి. ఈ నేను అనే తలంపు హృదయంలో నుండే వస్తోంది. దానిని లోపలకు ఉపసంహరించాలి. సత్వగుణం

లేకుండా, సహనం లేకుండా నేను అనే తలంపు లోపలకు వెళ్లదు. ఈ నేను అనే తలంపు లోపలకు వెళ్ళి దాని మూలంలో ఉన్న నిజమైన నేనును ఎప్పడైతే చూసిందో ఇది దహించి పోతుంది అంటే దేహగతమైన నేను దహించబడుతుంది. అప్పడు సత్యమైన నేను నీకు వ్యక్తమవుతుంది. అది నీ కడసారి జన్మ, మీరు ఎవరో మీకు తెలిసినప్పడు మీకు ఏమీ రియాక్షన్ ఉండదు. ఎందుచేతనంటే ఏ నేనుకైతే రియాక్షన్ వస్తోందో అది దాని మూలంలో కరిగిపోయినప్పడు ఇంక నీకు రియాక్షన్ లేదు. దేహము నేను అనే బుద్ధి నశించిన వాడికి ఇంక పునర్జన్మ లేదు. అంతర్గతంగా ఈశ్వరుడి పట్ల నీకు ప్రేమ, గౌరవం ఉండాలి. మీకు ఇష్టమైన నామాన్ని నిరంతరం స్మరిస్తూ ఉంటే, లోపల ఆ స్మరణ కంటిన్యూగా జరిగిపోతూ ఉంటే అవసరంలేని తలంపులు ఆగిపోతాయి, భగవంతుడి స్మరణ ఒక్కటే మిగులుతుంది. భగవాన్ ఏమి చెప్పారు అంటే నువ్వు మనస్సును హృదయంలో ఎంతకాలం ఉంచగలిగితే అంతకాలం నిలబెట్టి ఉంచు. దానివలన విషయచింతన తగ్గిపోతుంది, రూపబుద్ధి, నామబుద్ధి పోతుంది. అప్పడు మనస్సు నెమ్మదిగా పల్చబడిపోయి, చిరిగిపోతుంది. అప్పడు నీలో ఉన్న చైతన్యం, నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 25-02-08, సఖినేటిపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. మనం లోపలకు వెళ్ళటానికి చేస్తున్న ప్రయత్నమే సాధన. ఈశ్వరసాక్షాత్కారానికి మనం చేస్తున్న ప్రయత్నమే సాధన. నదీప్రవాహంలాగ ఆ సాధన నిరంతరం జరుగుతూ ఉండాలి. ప్రతీక్షణం మనం మెలుకువగా ఉండాలి. మీకు అందరికీ ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానం కలుగదేమో అని అనుమానం పెట్టుకోవద్దు. నాకు దుఃఖం వస్తోంది అని మూర్తిరాజుగారు అంటున్నారు. ఏ మనస్సుకు అయితే దుఃఖం వస్తోందో ఆ మనస్సు వేరుతో సహా నశించే వరకు మీరు రాబోయే జన్మలలో కోట్లాదిరూపాయలు ఉన్న సంసారంలో పుట్టినా మీకు దుఃఖం నశించదు అని చెప్పాను. నా మనస్సుకు దుఃఖం వచ్చినప్పడు మరి నేను ఎవరిని అని అడిగారు. అప్పడు కూడా మీరు మనస్సు కాదు, మీరు ఆత్మే. కాని దాని తాలుక ఎరుక మీకు లేదు కాబట్టి ఆత్మను మనస్సు అనుకొంటున్నారు, ఆత్మను దేహం అనుకొంటున్నారు. ఆత్మను మనస్సు